క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సర్పంచ్ ఇందూర్ సాయన్న, వీడీసీ అధ్యక్షుడు సొక్కం సంజీవ్, ఉపాధ్యక్షుడు గంగా మోహన్, కోశాధికారి బొబ్బిలి అనిల్ కుమార్, ఎంపీటీసీ బాల్ నర్సయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్లు..

రుద్రూర్: వేతనాల పెంపు, పర్మినెంట్ చేయడం, మల్టీపర్పస్ విధానం రద్దు కోసం గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన పాదయాత్రను జీపీ కార్మికులు జయప్రదం చేయాలని జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) కోటగిరి మండల కన్వీనర్ రాజేశ్వరి కోరారు. కోటగిరి మండల కేంద్రంలో పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాదయాత్ర ఈ నెల 12న జనగామ జిల్లా పాలకుర్తిలో ప్రారంభమైందని, 17 రోజుల పాటు 300 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 28న హైద్రాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు.

చెక్కుల పంపిణీ

బోధన్: ఎమ్మెల్యే క్యాంపస్ ఆఫీసులో గురువారం రెంజల్ మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, ఆ మండల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. మొత్తం 64 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించామని సర్పంచ్‌లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

రెంజల్(బోధన్): రెంజల్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ అందించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి చెక్కులను పంపిణీ చేశారు.

పాఠశాలలో ప్రేరణ కార్యక్రమం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాలలో ఐవిదా ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సుమారెడ్డి మాట్లాడారు. సమాజంలో కాళ్లు, చేతులు సవ్యంగా ఉండి సోమరితనంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తారని, ఐవిదా ఇన్స్టిట్యూట్‌లో అంగవైకల్యంతో ఉన్న విద్యార్థులు ఏమాడు బాధపడకుండా దేవుడు ఇచ్చి గాత్ర కళతో తమను తాము పోషించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందెకెళ్లాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

భీమ్‌గల్: గత ఏడాది మార్చి 31లోపు నగదు విడుదల కాక పలు బిల్లులు రీవ్యాలిడేట్ చేసుకోవాల్సి వచ్చిందని, ఈ సారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఇప్పటి వరకు ట్రెజరీల్లో ఆమోదం పొంది రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులకు సంబంధించిన నగదును వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్దన్ గురువారం డిమాండ్ చేశారు. జనార్దన్ మాట్లాడుతూ..ఐటీ రిటర్నులు సమర్పించే సందర్భంలో వ్యక్తి గత ఖాతాల్లో నగదు జమ కాకున్నా, ట్రెజరీలో ఆమోదం పొందడంతో ఆ మొత్తాన్ని ఆదాయంలో చూపించి పన్ను కట్టాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు స్పందించాలని కోరారు.

కాంగ్రెస్ దిమ్మె తొలగింపు

వర్ని: మండల కేంద్రంలో తెలంగాణ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్మించిన జెండా దిమ్మెను ఆర్అండ్‌బీ అధికారులు గురువారం తొలగించారు. జెండా దిమ్మె నిర్మించడం వల్ల వ్యాపార సముదాయాలకు ఆటంకం కలుగుతుందని అధికారులకు ఫిర్యాదు చేయడంతో జెండా దిమ్మెను జేసీబీలతో తొలగించారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పార్టీ దిమ్మె ఉంచి మరో పార్టీ దిమ్మెను ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రుద్రూర్: లింగంపల్లి శివాలయంలో గురువారం దివ్య శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాలయోగి మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్, వేద పండితులు నరేష్ శర్మ, భాను ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పిట్ల కృష్ణ మహరాజ్ ప్రవచనాలు చెప్పారు.

విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నాం

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కోటగిరి మండలం సుద్దులం తండాలో వలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సుద్దులం తండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్ (కోటగిరి) : తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో పాటు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండలం సుద్దులం తండాలో గురువారం గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సేవాలాల్ మహరాజ్, జగదాంబ మందిరానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తోందన్నారు. తాజాగా గిరిజన బాలికల కోసం బాన్సువాడ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ సంక్షేమ గురుకుల పాఠశాల మంజూరు చేశారని, ఇందుకు సంబంధించిన జీవోను గురువారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా బాన్సువాడ సెగ్మెంట్‌లో 11 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కొనసాగుతుందన్నారు. త్వరలోనే రూ.3 లక్షల పథకం వస్తుందని, దీంతో ఇళ్లులేని ప్రతి పేద కుటుంబానికి పక్కా గృహం మంజూరు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలుస్తోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, స్థానిక సర్పంచ్ కిషన్, బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావ్, కల్లూర్ రాంరెడ్డి, ఎజాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని 11, 29వ వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 ఏళ్ల పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు కంటి సమస్య ఉన్నవారు కేంద్రాలకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కళ్లద్దాలు, మందులు అందిస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్లు సాయి, మీనా చందు, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సానిటరీ ఎస్సై మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు కచ్చితంగా చేయించుకోండి

వేల్పూర్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐవో) అశోక్ పేర్కొన్నారు. పచ్చలనడ్కుడలో గురువారం ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంతో వ్యయంతో కూడిన కంటి పరీక్షలు కంటి వెలుగు ద్వారా ఉచితంగా చేయించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమ జమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, స్థానిక సర్పంచ్ ఏనుగు శ్వేతా గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాసాకొత్తూర్‌లో శిబిరం ప్రారంభం

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో కంటి వెలుగును ఎంపీపీ గౌతమి, సర్పంచ్ ఏనుగు పద్మతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, శిబిరం నెల రోజుల పాటు కొనసాగుతుందని, రోజు 150 మంది చొప్పున వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. ఎంపీవో శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజేశ్వర్, కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, హెచ్‌ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



కోటగిరిలో జెండా ఎగురవేస్తున్న కాసుల బాల్‌రాజ్

రుద్రూర్ (కోటగిరి): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని టీపీసీసీ సభ్యులు, బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ విమర్శించారు. హాత్‌సే హాత్ జోడో అభియాన్‌లో భాగంగా కోటగిరి మండల కేంద్రంలో గురువారం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. డీసీసీబీ కార్యదర్శి కొట్టం మనోహర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా మండల కేంద్రంలో..

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని విమర్శించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి కూనిపూర్ రాజారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

- 60వ రోజుకి చేరిన న్యాయవాదుల దీక్షలు



బోధన్ : బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావాలని ఈ ప్రాంత ప్రజల బలమైన ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని న్యాయవాదులు అన్నారు. రెండు నెలలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 60 వ రోజుకు చేరాయి. దీక్షలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డి, న్యాయవాది అర్జున్ రాందర్‌లు కూర్చున్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్) : అసైన్డు భూములకు ఇంటినెంబర్లు కేటాయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి డిమాండ్ చేశారు. పెర్కిట్‌లో గురువారం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పని చేసిన అనుభవంతో కమిషనర్ అక్రమంగా ఇంటి నెంబర్లను కేటాయిస్తూ అధికార పార్టీ కౌన్సిలర్ల రియల్ వ్యాపారానికి అండగా ఉంటున్నాడన్నారు. వారం రోజుల్లోనే సుమారు 30 ఇంటి నెంబర్లను కేటాయించారని వెల్లడించారు. సమావేశంలో బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, సీనియర్ నాయకులు ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, విజాయనంద్, గుగులోత్ తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య


ఆర్మూర్‌టౌన్: విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఈశ్వరయ్య అన్నారు. ఆర్మూర్ ఏఈ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ మీటర్ సమస్యలు మీటరు ఆగిపోవుట, కాలిపోవుట సమస్యలు ఉంటే ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ హెచ్చు తగ్గు సమస్యలు, ఎక్కువ బిల్లు వచ్చిన సమస్యలపై వ్యక్తిగతంగా, వాట్సాప్, మెయిల్, పోస్టు ద్వారా సైతం ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీజీఆర్ఎఫ్ కిషన్, భూమారెడ్డి, డీఈ హరిచందనాయక్, ఏడీఈ శ్రీధర్ పాల్గొన్నారు.

శివరాత్రికి సిద్దుల గుట్ట ముస్తాబు



ఆర్మూర్‌లో సిద్దుల గుట్టపైకి ఎక్కడానికి మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు

ఆర్మూర్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయం ముస్తాబవుతోంది. శనివారం రోజున మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, శివనాసమ స్తోత్రంతో జాగారాం, భజన, ఆదివారం వేల సంఖ్యలో భక్తులకు అన్నదానం నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రత్యేకంగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతూ ఏర్పాట్ల విషయంలో పలు సూచనలిస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణానికి దక్షిణ నైరుతి భాగంలో కొన్ని కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ సిద్దుల గుట్టకు ఉత్తరం వైపున పట్టణంలోని గోల్ బంగ్లా సమీపంలో నుంచి సిద్దుల గుట్టపైకి కాలి నడకన వెళ్లడానికి మెట్ల మార్గం ఉంది. ఈ మెట్ల మార్గం పొడవునా రేకుల షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో చలవ పందిళ్లు వేస్తున్నారు.



గుట్టపైకి ఎక్కడానికి నిర్మించిన ఘాట్ రోడ్డు

మహిమ గల దేవుడు..



చారిత్రక ప్రాశస్త్యం గల నవనాథ సిద్దుల గుట్టపై వెలసిన శివుడు మహిమ గల దేవుడిగా కీర్తి గాంచాడు. ఇక్కడ శివున్ని దర్శనం చేసుకున్న వారికి కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో ప్రతీ ఏటా వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సిద్దుల గుట్టను ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

– ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్

అంబలి సేవ ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంబలి సేవా కార్యక్రమం ప్రారంభమైంది. పోషకాలతో కూడిన అంబలిని విద్యార్థులకు సర్పంచ్ అశోక్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్, నాయకులు మహేష్, రాజు, ప్రశాంత్, అబ్బాస్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ గురువారం భూమి పూజ చేశారు. అమెరికాకు చెందిన బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సంస్థ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.87 లక్షలు అందజేశారు. దీంతో నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, ఎంపీపీఎస్ హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు సాగర్, లావణ్య తదితరులున్నారు.

ఏర్గట్లలో బీజేపీ కార్నర్ మీటింగ్



మోర్తాడ్(బాల్కొండ): ప్రజా గోస– బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ గురువారం ఏర్గట్లలో జరిగింది. ముఖ్య అతిథిగా నిజమాబాద్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, మల్కన్నగారి మోహన్ హాజరై మాట్లాడారు. దళిత బంధు, ఫసల బీమా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో జరుగుతున్న అవినీతిపై కేసీఆర్‌ను ప్రశ్నించారు. నేతలు ఏలేటి నారాయణ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, బొల్లి శంకర్, రాజారెడ్డిపాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, పాల్గొన్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో కచ్చితంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆదేశించారు. గురువారం జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో విద్య, వైద్యం, ఐసీడీఎస్ శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సబ్జెక్టు పరంగా అవసరమైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న తరుణంలో ఎటువంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు అరికట్టడానికి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. విధిగా వారి పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఈవో గోవింద్‌నాయక్, జెడ్పీటీసీలు ఎర్రం యమున, బానోత్ కమల, భారతి, డీఈవో దుర్గాప్రసాద్, డీఎంహెచ్‌వో సుదర్శనం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

నవీపేట: బోధన్ ఎమ్మెల్యే షకీల్‌పై బీజేపీ బోధన్ నియోజవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలు అన్నారు. జన్నేపల్లిలో నాయకులు తెడ్డుపోశెట్టి, ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ గౌరురాజులు మాట్లాడారు. జన్నెపల్లిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే షకీల్ రూ. 2.10 కోట్ల నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు.

శనగకు మద్దతు ధర అందించాలి

రెంజల్(బోధన్): శనగ పంటకు కనీస మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డీటీ శశిభూషణ్‌కు వినతిపత్రం అందించారు.

దళారులకు విక్రయించొద్దు

రెంజల్(బోధన్): శనగ రైతులు తొందరపడి దళారులకు శనగలను విక్రయించవద్దని మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం మండలానికి రెండు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం క్వింటా శనగకు రూ.5,333 ధర చెల్లిస్తుందన్నారు. రెంజల్, నీలా గ్రామాల్లో శనగ కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి లభించిందని వివరించారు.

స్వచ్ఛమైన నీరు సేవించడంతోనే ఆరోగ్యం

రెంజల్(బోధన్): ప్రజలు స్వచ్ఛమైన నీరు సేవించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వక్తలు పేర్కొన్నారు. 80 రకాల రోగాలు కలుషిత నీటితో వ్యాపిస్తాయని అన్నారు.బోర్గాంలో గురువారం ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని సంస్థ ప్రతినిధులతో పాటు స్థానిక సర్పంచ్ వాణి ప్రారంభించారు.

రానున్న ఎన్నికల్లో అధికారాన్ని సాధిస్తాం

నవీపేట: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని సాధిస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ల లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. నాగేపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలకు ఆకర్షితులైన ఓటర్లు రాష్ట్రంలో బీజేపీకి అధికారాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో ఆలయాలు సిద్ధం



నందిపేటలోని కేదారీశ్వరాలయం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట, డొంకేశ్వర్ మండలాలోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాభయ్యాయి. మండల కేంద్రానికి సమీపంలోని కేదారీశ్వర ఆశ్రమంలోని ఆలయ ప్రాంగణాలన్నింటినీ అందంగా తీర్చిదిద్దారు. భక్తులు సేద తీరడానికి విడుదులను ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మెడ గ్రామ శివారులో గల గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉమామహేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేస్తున్నారు.

అంగన్‌వాడీల హక్కుల సాధనకు కృషి

బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం తమ యూనియన్ శాయశక్తులా కృషి చేస్తుందని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని యూనియన్ భవన్‌లో నిర్వహించిన బోధన్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల తరహాలోనే అంగన్‌వాడీలను గుర్తించి, వారి వేతనాలు, బెనిఫిట్స్ అందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశానంతరం 100 మంది అంగన్‌వాడీ టీచర్లు యూనియన్ సభ్యత్వం తీసుకున్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి అమృత్ కుమార్, ప్రతినిధులు నారాయణ రెడ్డి, సుమన్ కుమార్ పాల్గొన్నారు.



సమాచారం..

శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బోధన్: మహా శివరాత్రి పర్వదినం రోజున ప్రముఖ శైవ క్షేత్రాలైన ఏడుపాయల, వేములవాడ, కాళేశ్వరం ఆలయాల దర్శనానికి వెళ్లే భక్తుల కోసం బోధన్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం టీఎన్ స్వామి గురువారం తెలిపారు. డిపో పరిధిలోని బోధన్ నుంచి వర్ని, పోతంగల్ మండలాల రూట్లో లోకల్ బస్సులను నడుపుతామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆయుత చండీ మహాయాగం

బోధన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కరీంగనగర్ జిల్లా విశ్వేశ్వర మహా పీఠాధిపతి ప్రణవానంద స్వామి ఆధ్వర్యంలో బోధన్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న అయుత చండీ మహాయాగం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు కొనసాగనుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యాగం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. యాగంలో 516 మంది జంటలు కూర్చుండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడవ రోజు దుర్గామాత ఉత్సవ విగ్రహానికి రథయాత్రతో యాగం తంతు ముగియనుంది.